క్లుప్తంగా

నేడు 'పేట' 2వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

జగ్గయ్యపేట అర్బన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం 1వ సచివాలయం పరిధిలోని 2వ వార్డు కాకాని నగర్‌లో జరుగుతుందని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్(బాజీ) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు డాంగేనగర్‌లోని పెద్దాయన వీధి వద్ద నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను పాల్గొంటారని పేర్కొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి స్పందన

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆర్డీఓ రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తోందన్నారు. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

గో సంరక్షణకు రూ.10,116 విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీతిరుపతమ్మ ఆలయానికి చెందిన గోశాలలో గోవుల సంరక్షణకు ఆదివారం గుంటూరు రూరల్‌కు చెందిన కొరిటపాడు గ్రామ భక్తుడు కన్నసాని రవికుమార్ రూ.10,116 విరాళాన్ని ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావుకు అందజేశారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

కంచికచర్ల: ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమానికి గ్రామాల్లోని అన్ని రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని తహసీల్దార్ పబ్బారి శంకర బాబు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని బీఎల్వోలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన యువతను గుర్తించి వారికి ఓటు హక్కు కల్పించేలా బీఎల్వోలు చూడాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అందరి సహకారంతో నాణ్యమైన ఓటరు లిస్టును తయారు చేస్తారన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అల్లూరు(వీరులపాడు): అంటరానితనం నిర్మూలన జరగకుండా దేశ ప్రగతి సాధ్యం కాదని చెప్పిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని అల్లూరులో జైభీమ్ నగర్ అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యాన నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర విగ్రహాన్ని జైభీమ్ యూత్ సభ్యులతో కలిసి ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ దేశంలో అంటరానితనం, సామాజిక అసమానత నిర్మూలనకు జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడన్నారు. అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బందెల రాణి, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, కవి, రచయిత తంగిరాల సోని, ఏపీ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ అమర్లపూడి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడద

చింతలపాడు(నందిగామ టౌన్): పిచ్చికుక్కల స్వైర విహారంతో 10 మందికి తీవ గాయాలయ్యాయి. చందర్లపాడు మండలం చింతలపాడులో కొంత కాలంగా వీధికుక్కలు గ్రామస్తులను హడలెత్తిస్తున్నాయి. ఆదివారం గ్రామంలోని సూరబోయిన సంజయ్ రాజు కుక్కల దాడిలో గాయపడ్డాడు. అతను నందిగామ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గ్రామంలో కొంత కాలంగా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని చిన్నా పెద్దా తేడా లేకుండా దాడి చేస్తున్నాయని వాపోతున్నారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధికుక్కల బెడదను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొనసాగుతున్న పోలీస్ పహారా

నందిగామ: పట్టణంలోని డీవీఆర్ కాలనీలో ఆదివారం కూడా పోలీస్ పహారా కొనసాగింది. కాలనీలోని ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన ఓ కట్టడాన్ని శుక్రవారం మున్సిపల్ అధికారులు తొలగించిన సంగతి పాఠకులకు విదితమే. గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయాన్ని తొలగించారని పలువురు స్థానికులు ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్తగా కాలనీలో ఇన్‌స్పెక్టర్ హనీష్ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలని ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలువురు నిరసన తెలిపారు.

వేగంగా ఓటరు సర్వే

- నందిగామలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- 21తో ముగియనున్న సర్వే



నందిగామలో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ రవీంద్రరావు

నందిగామ: ఇంటింటి ఓటరు సర్వే వేగంగా జరుగుతోంది. తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి సిబ్బంది సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 21తో సర్వే ముగియనున్న నేపథ్యంలో నందిగామ నియోజకవర్గ పరిధిలో కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతోంది.

రోజూ ప్రత్యేక సమీక్షలు

ఇంటింటి సమగ్ర ఓటరు సర్వే జూలై 21 నుంచి మొదలైంది. ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగనుంది. సమయం సమీపిస్తుండటంతో ఉన్నతాధికారులు బూత్ లెవెల్ అధికారులతో సమీక్ష చేస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ బీఎల్వోలు ప్రతి ఇంటికీ వెళ్లి యాప్ ద్వారా ఓటరు జాబితాకు సంబంధించి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించడంతోపాటు వారి అనుమతితో మార్పులు చేర్పులు చేస్తున్నారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. కుటుంబంలో మరణించిన వారి పేర్లు తొలగించడం, ఓటరు జాబితాలో తప్పులు ఏమైనా ఉంటే సరి చేస్తున్నారు.

222 మంది బీఎల్వోలతో సర్వే

నియోజకవర్గంలో 222 మంది బీఎల్వోలు ఓటరు సర్వేలో పాల్గొంటున్నారు. ప్రతి బూత్ లెవెల్‌లో జరిగే సర్వే పరిశీలనకు నియోజకవర్గంలో 20 మంది సూపర్‌వైజర్లను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో ఐదుగురు ఏఈఆర్‌ఓలు సర్వేను పరిశీలిస్తున్నారు.

నియోజకవర్గంలో ఓటరు సర్వే తీరు, సకాలంలో సిబ్బందితో సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయించే అంశాలను ఆర్డీవో రవీంద్రరావు పరిశీలిస్తున్నారు. సిబ్బందికి ఎప్పటికప్పుడు పలు సూచనలు సలహాలు ఇస్తున్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించి తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేయడానికి సమీక్షలు చేస్తున్నారు.

లక్షకు దాటిన సర్వే

నియోజకవర్గ పరిధిలో మొత్తం 1,95,796 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో ఇప్పటికే 1,10,173 ఓటర్లకు సంబంధించి బీఎల్వోలు సర్వే పూర్తి చేశారు. నిర్దేశిత సమయంలో ఇంటింటి ఓటరు సర్వే కార్యక్రమం పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తున్నారు.

'నందిగామ'లో ఓటర్లు ఇలా

- నియోజకవర్గంలో గృహాలు 75,203
- మొత్తం ఓటర్లు : 1,95,786 మంది
- పురుషులు : 95,342
- మహిళలు : 1,00,444
- ట్రాన్స్‌జెండర్ : 10

బీఎల్వోలకు సహకరించండి

నియోజకవర్గంలో ఇంటింటి ఓటరు సర్వే సమర్థంగా జరుగుతోంది. బూత్ లెవెల్ అధికారులు ఇంటికి వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ సహకరించండి. ఆ సమయంలో ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులున్నా వారి దృష్టికి తీసుకెళ్లి సరి చేసుకోవచ్చు. బీఎల్వోలు ఇంటికి వచ్చినప్పుడు మీకు ఏమైనా అనుమానాలు ఉంటే అక్కడే నివృత్తి చేసుకోవచ్చు. నియోజకవర్గంలో తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలన్న లక్ష్యంతో పని చేస్తున్నాం. దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలి.

–ఎ.రవీంద్రరావు, ఆర్డీఓ, నందిగామ

రూ.561.98 కోట్లతో అభివృద్ధి

- అభివృద్ధి చేసే సత్తా లేని టీడీపీకి విమర్శించే అర్హత లేదు
- ప్రభుత్వ విప్ ఉదయభాను



పేటలో వేపలవాగును పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంతో పాటు నియోజకవర్గాన్ని సుమారు 561.98 కోట్లతో అభివృద్ధి చేస్తుండగా, అది చూసి ఓర్వలేని టీడీపీ వారు అవాస్తవాలను మాట్లాడుతూ అబద్ధాలను నిజం చేయడానికి అవస్థ పడుతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఆదివారం పట్టణంలోని వేపలవాగు, ఎర్రకాలువ, చెరువు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేపలవాగు, ఎర్రకాలువలో పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరిగి చెరువుకు పుష్కలంగా నీరు రాకపోవడంతో రూ.40 లక్షల వ్యయ అంచనాతో పూడికతీత పనులు చేపట్టినట్లు తెలిపారు. అవి కొనసాగుతున్నాయన్నారు. పర్యాటక కేంద్రంగా చెరువును అభివృద్ధి చేస్తుండగా, దాన్ని చూసి తమకు మంచి పేరు వస్తుందనే అసూయతో కౌన్సిల్ సమావేశంలో ప్రతిపక్ష సభ్యులు చెరువు కింద ఉన్న పంట పొలాలకు నీరు ఆగిపోయిందని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవానికి చెరువు అభివృద్ధి పనులతో ఊర చెరువు కింద ఉన్న సుమారు 350 ఎకరాల సాగునీరుకు ఆటంకం లేదని స్పష్టం చేశారు. చెరువుకు నీటి సరఫరా చేసే ప్రధాన చానళ్లు వేపలవాగు, ఎర్రకాలువల్లో పూడిక తీయడంతో గతంలో కంటే ఇప్పుడే పుష్కలంగా చెరువులో నీరు వస్తుందని తెలిపారు. ఇప్పుడు ఒక్క పంట కాదు, మూడు పంటలకు కూడా సరిపడా నీరు పుష్కలంగా లభిస్తుందని తెలిపారు. సుమారు రూ.10 కోట్ల ప్రాజెక్టుతో జిల్లాలో మేటి పర్యాటక కేంద్రంగా జగ్గయ్యపేట చెరువును అభివృద్ధి చేస్తుండగా, అది చూసి టీడీపీకి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని, దీంతో వారు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ఆరోపణలు చేస్తూ విషం కక్కుతున్నారని విమర్శించారు. గత టీడీపీ పాలనలో ఏమి అభివృద్ధి చేశారో చర్చకు వస్తారా అని సవాల్ విసిరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అందుతున్నాయని, కనీసం ప్రతి ఇంటికీ రూ. లక్షకు తగ్గకుండా లబ్ధి చేకూరిందన్నారు. వివిధ సంక్షేమ పథకాలు, నాడు–నేడు, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్,రోడ్లు, డ్రెయిన్లు తదితర వివిధ రంగాలకు కలిసి పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగేళ్లలో రూ 561.98 కోట్ల అభివృద్ధి పనులు జరిగినట్లు తెలిపారు. తాము చేస్తున్న అభివృద్ధిని వారు ఒప్పుకున్నా, లేకపోయినా, నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మున్సిపల్ కౌన్సిలర్లు కొలగాని రాము, గింజుపల్లి వెంకట్రావు, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాబు, నాయకులు తన్నీరు నాగేంద్ర, దువ్వల రామకృష్ణ, పూసల పుల్లారావు, శేషం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకాల పరిశీలన



పైపులైన్ పనుల పర్యవేక్షణలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, డీఈలు, సర్పంచ్ పద్మకుమారి

పెనుగంచిప్రోలు: ఇటీవలన కురిసిన భారీ వర్షాలకు మునేరులో తాగునీటి పథకాలకు సంబంధించిన పైపులైన్ కొట్టుకు పోయి గ్రామంలో తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. శనివారం విజయవాడలో జరిగిన నియోజకవర్గ సమీక్ష సమావేశంలో ఈ సమస్యను ప్రస్తావించారు. ఇన్‌చార్జి మంత్రి వెంటనే సమస్యను పరిష్కరించాలని కలెక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ, డీఈ డీఈ నరసింహారావు, ఏఈ నరసింహారావు మునేరులో సుమారుగా 200 మీటర్లు పైపులైన్ కొట్టుకుని పోయినట్లు వారు గుర్తించారు. ఎస్ఈ మాట్లాడుతూ వారం, పది రోజుల్లో మరమ్మతులు పూర్తి చేసి గ్రామంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. పైపులైన్ మరమ్మతుల్లో ఉన్నప్పటికీ సర్పంచ్ ఆధ్వర్యాన గ్రామంలో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా నిరంతరాయంగా కొనసాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికను గర్భవతి చేసిన వ్యక్తిపై కేసు

చింతలపాడు(నందిగామ టౌన్): పదో తరగతి బాలికపై అత్యాచారం చేసి గర్భవతిని చేసిన ఘటన చందర్లపాడు మండలం చింతలపాడు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన మాణిక్యాలరావు అనే వ్యక్తి గత కొంత కాలంగా బెదిరించి అత్యాచారానికి పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో బాలిక గర్భం దాల్చటంతో అసలు విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మాణిక్యాలరావుకు దేహశుద్ధి చేశారు. ఈ ఘటనలో స్వల్పంగా గాయపడిన వ్యక్తి నందిగామ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

వజ్రాల కొండపై పెరిగిన అన్వేషకులు



రామన్నపేట సమీపంలోని వజ్రాల కొండకు వస్తున్న మహిళలు

నందిగామ: చందర్లపాడు మండలం రామన్నపేట సమీపంలోని అటవీ ప్రాంతం కొద్ది రోజులుగా వజ్రాల వేట కోసం వచ్చే అన్వేషకులతో కళకళలాడుతోంది. కృష్ణా నది సమీపంలో అటవీప్రాంతంలోని వజ్రాల కొండపై ఎంతో అరుదైన, విలువైన వజ్రం దొరికిందని శనివారం పుకార్లు షికార్లు చేశాయి. ఈ నేపథ్యంలో ఆదివారం అన్వేషకుల తాకిడి మరింత పెరిగింది. నిజంగానే వజ్రాలు దొరుకుతున్నాయా లేదంటే ఇవన్నీ పుకార్లేనా అనే అంశం తెలియాల్సి ఉంది. ఇదిలా ఉండగా వజ్రాలు, రంగురాళ్లు కొనుగోలు చేసేందుకు సుదూర ప్రాంతాల నుంచి వ్యాపారులు రామన్నపేట కొండకు క్యూ కడుతున్నారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

వరుస సెలవుల నేపథ్యంలో పెరిగిన భక్తుల తాకిడి



ఆదిదంపతుల ఉత్సవ మూర్తులకు శాంతి కల్యాణం చేస్తున్న అర్చకులు



క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలిరావడంతో ఆలయానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. రెండో శనివారం, ఆదివారంతో పాటు మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవం నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి విచ్చేస్తున్న భక్తుల సంఖ్య అధికంగా కనిపిస్తోంది. వరుస సెలవుల నేపథ్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ కనిపించింది. ఆది దంపతులను దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులతో పాటు ఆర్జిత సేవల్లో పాల్గొనేందుకు సైతం ఉభయదాతలు ఆసక్తిని చూపుతున్నారు. దీంతో ఖడ్గమాలార్చనతో పాటు లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీహోమాల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొని తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు.

లోక కల్యాణార్థం సూర్యోపాసన సేవ

లోక కల్యాణార్థం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్య భగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. సేవలో పాల్గొన్న ఉభయ దాతలు, భక్తులకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

క్యూలైన్లను పర్యవేక్షించిన చైర్మన్

భక్తుల రద్దీ నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు క్యూలైన్లను పర్యవేక్షించారు. రూ.100 క్యూలైన్‌లో భక్తులు అధికంగా ఉండటంతో వారికి రూ. 300 క్యూలైన్‌లోకి మళ్లించి రెండు క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకునేందుకు అవకాశం కల్పించారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో పంపిణీ చేస్తున్న ఉచిత ప్రసాదంతో పాటు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన పంచహారతుల సేవలోనూ ఉభయదాతలు, భక్తులు, పలువురు ప్రముఖులు విశేషంగా పాల్గొన్నారు.

కాళీమాతకు విశేష పూజలు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని కోదాడ రోడ్డు పుట్టబజారులోని శ్రీకోల్‌కతా కాళీ మాత విశ్వరూప శివ దుర్గాభవానికి ఆదివారం భక్తులు విశేష పూజలు చేశారు. అర్చకులు తానూరి శ్రీను అమ్మవారికి నిమ్మకాయల దండలు, రంగు రంగుల పూలదండల అలంకరణతో పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో అన్నదానం జరిగింది. పట్టణానికి చెందిన దాత చిలుకూరి హరికృష్ణ, శిరిష దంపతులు అమ్మవారి మెడలో అలంకరణకు రూ. 30 వేలు విలువ చేసే వెండి పుష్పమాలను అర్చకునికి అందజేశారు.

సంగమంలో వ్యూహం షూటింగ్ సందడి



గోదావరి పుష్కరాల తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన సన్నివేశం

ఇబ్రహీంపట్నం: సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ నిర్మిస్తున్న వ్యూహం చిత్రం షూటింగ్ స్థానిక పవిత్ర సంగమం వద్ద ఆదివారం జరిగింది. చంద్రబాబు పాత్రదారుడు ధనుంజయ ప్రభుతో పాటు పలువురు జూనియర్ ఆర్టిస్టులు షూటింగ్‌లో సందడి చేశారు. గోదావరి పుష్కరాల్లో చంద్రబాబు ప్రసంగంతో భక్తులు నిరీక్షించి తొక్కిసలాటలో మృతి చెందిన సంఘటన అసిస్టెంట్ డైరెక్టర్ చిత్రీకరించారు. మొత్తం రుణమాఫీ చేసి నిరూపిస్తా, ఉచిత విద్యుత్ అమలుచేస్తే కరెంట్ తీగలపైన బట్టలు ఆరేసుకోవాల్సిందే అని అప్పట్లో నోరు జారానని ధనుంజయప్రభు ప్రసంగాన్ని చిత్రీకరించారు. షూటింగ్ జరుగుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పార్టీ నాయకులతో కలసి సంగమం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. పట్టిసీమ ప్రాజెక్ట్ నిర్మాణంలో చంద్రబాబు కష్టాన్ని కూడా చిత్రీకరించాలని డిమాండ్ చేశారు.

నేత్ర సమస్యలపై అప్రమత్తత అవసరం

పటమట(విజయవాడతూర్పు): శరీరంలో కన్ను చాలా సున్నితమైన అవయవమని, దానికి వచ్చే చిన్న సమస్యలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కంటి వైద్యుడు బి.సుబ్బారావు తెలిపారు. సమభావన మిత్రమండలి ఆధ్వర్యంలో బెంజిసర్కిల్ వద్ద ఉన్న వాసవ్య మహిళా మండలిలో 91వ సమావేశంలో భాగంగా నేత్ర సంబంధ సమస్యలపై ఆదివారం అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. కంటి సమస్యలపై అశ్రద్ధ చూపకూడదన్నారు. వర్షాలు, ఎండలు శరీరానికి తగలకపోవటం, సూక్ష్మ గ్రహణాన్ని నేరుగా చూడటం, అనవసరంగా కళ్లను నలపటం వంటి కారణాలతో కంటి సంబంధ రుగ్మతలు తలెత్తుతాయని చెప్పారు. కంటి సమస్యల పరిష్కారానికి అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని, వీటిని అందరూ ఉపయోగించుకోవాలన్నారు.

బాలల రక్షణ బాధ్యత మనందరిది

కృష్ణలంక(విజయవాడతూర్పు): బాలల హక్కుల రక్షణ, వాటిని అమలు పరచడం మనందరి బాధ్యత అని నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ షేక్ నజ్మా అన్నారు. రాణిగారితోటలోని సిమెంట్ గోడౌన్స్‌లో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో ఆదివారం పారిశుద్ధ్య కార్మికులకు బాలల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నజ్మా మాట్లాడుతూ.. 18 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారందరూ బాలలేనని, వారి అభిప్రాయాలను గౌరవించి వారి మాటలకు విలువ ఇవ్వాలన్నారు. బాలలను కొట్టడం, తిట్టడం, మానసికంగా వేధించడం వలన మానసికంగా కుంగుబాటుకు గురవుతారని, వారి జీవితంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపిస్తుందని చెప్పారు. మానవ హక్కులన్నీ బాలలకు వర్తిస్తాయని, బాలలను పరిరక్షించుకుని వారికి రక్షణగా ఉందామన్నారు. బాలల పట్ల లైంగిక వేధింపులు లాంటి సంఘటనలు జరుగకుండా చూడాలన్నారు. బాల్య వివాహాన్ని ప్రోత్సహించిన తల్లిదండ్రులు, సంరక్షకులకు కూడా శిక్ష పడుతుందని హెచ్చరించారు. విద్యార్థి దశ నుంచి సరైన అవగాహన కల్పించినట్లయితే మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా సమాజంలో మంచి పౌరులుగా ఉంటారన్నారు. మత్తు పదార్థాల వ్యసనం నుంచి డీ ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని చెప్పారు.

గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో భక్తుల సందడి



గుణదల మేరీమాత పుణ్యక్షేత్రానికి వచ్చిన భక్తులు

గుణదల(విజయవాడ తూర్పు): గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో ఆదివారం ఉదయం సమష్టి దివ్యబలి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దేవుని పట్ల విశ్వాసం కలిగి, ఆయన కృపకు పాత్రులుగా జీవించాలన్నారు. భక్తులు దైనందిన జీవితంలో పాపానికి తావివ్వకుండా సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. లోక రక్షకుడైన క్రీస్తు సమస్త మానవాళిని పరిరక్షించేందుకు శిలువ మరణం పొందారని వివరించారు. ఆయన త్యాగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు మరియమాతను దర్శించుకున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



భీమవరం జెడ్పీ హైస్కూల్ 1987-88 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

భీమవరం(వత్సవాయి): పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా 1987–88 టెన్త్ బ్యాచ్ పూర్వవిద్యార్థులు కలుసుకుని కుశలప్రశ్నలు వేసుకున్నారు. ప్రస్తుతం తాము, పిల్లలు ఏం చేస్తోంది చెప్పుకున్నారు. అనంతరం ఆటపాటలతో సందడి చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకున్నారు. ఏటా అంతా కలుసుకోవాలని తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు కేఆర్ సవితాభరద్వాజ్, వెంకటరెడ్డి, నారాయణరావు, వెంకటరత్నం, శ్రీవాణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వరునికి రుద్రాభిషేకం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాత శివాలయంలో కొలువై ఉన్న నందీశ్వరునికి త్రయోదశిని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి నెల బహుళ త్రయోదశిని ప్రదోష కాలంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించటం ఆనవాయితీ. అందులో భాగంగా ఆదివారం విశేష వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే పంచహారతులను నిర్వహించి నందీశ్వరునికి నూతన వస్త్రాలను సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి కె.నాగరాజు పర్యవేక్షించారు.

అంకమ్మ తల్లికి విశేష పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీకాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు కుంకుమార్చనలు, అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కుబడులు చెల్లించుకున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com